

# ఓటు

'గిలకల బావి' పదివేల జనాభా వున్న పెద్ద గ్రామం. ఆ గ్రామంలో, కూటికి గతిలేని వాళ్ళ దగ్గర్నుంచి, కోట్లకి పడగలెత్తిన వారిదాకా ఉన్నారు.

వారిలో భూషణం, చక్రవర్తులు ముఖ్యులు. వాళ్ళిద్దరికీ లక్ష్మీదేవి అండవుంది. ఇద్దరికీ కొండంత పలుకుబడి వుంది. కావల్సినంత అహం వుంది. పుట్టెడు పదవీ వ్యామోహం వుంది. ఎవరికి వారికే 'తామే ఆ ఊరికి మకుటంలేని మహారాజులం' అన్న నమ్మకం వుంది. ఇలాంటివి ఇంకా చాలా ఉన్నాయి.

ఇద్దరూ ఎమ్.ఎల్.ఏలుగా చేశారు. వాళ్ళిద్దరూ తాము తప్ప మరో వ్యక్తి గెలవడం సహించలేరు. వాళ్ళిద్దరి మధ్యా నిప్పుగప్పి వేస్తే భగ్గుమనేంతటి వైరంవుంది.

ప్రస్తుతం ఆ ఊరికి ఎమ్మెల్యే భూషణం. చక్రవర్తి మాజీ ఎమ్మెల్యే. త్వరలో రాబోయే ఎన్నికల్లో తనే గెలవాలని చాలా వ్యూహాలు పన్నుతున్నాడు చక్రవర్తి.

అదే ఊళ్ళో ఓబులేసు ఓ బక్క చిక్కిన ప్రాణి. గూడానికి చివరగా ఉంటుందతని గుడిసెలాంటి పాక.

అతని ఇంట్లో ఆరు ఓట్లున్నాయి. అతను, అతని భార్యా, తమ్ముళ్ళిద్దరూ, తల్లిదండ్రులు అందరి ఓట్లూ కలిపి ఆరు. అందుకే పెద్దలిద్దరి దృష్టీ అతని ఇంటిమీద ఉంది.

సాధారణంగా ఎలక్షన్లు వస్తున్నాయంటే చాలా మందికి ఆనందం. డబ్బు రూపేణా, సారాబుడ్ల రూపేణా ఇంకా అనేకవస్తు రూపేణా సొంతవస్తవి. కాని ఓబులేసుకి మాత్రం ఎలక్షన్లంటే చచ్చే భయం. గుండెదడ!

కారణం కిందటిసారి భూషణానికి ఓటేసినట్టు తెలిసిన చక్రవర్తి అతని మీద ఆగ్రహించి, అతని ఇంటిని అగ్నిహోత్రుడికి నైవేద్యం పెట్టాడు.

ఆ కొంపని మళ్ళీ నిర్మించుకోవడానికి ఓబులేసు, అతని కుటుంబ సభ్యులు చాలా యాతనపడాల్సొచ్చింది. పసిబిడ్డ దాకా పనిచేసి, వృద్ధులు తంబాకు వాసల్లి సొమ్ము కూడబెట్టి ఎలా అయితే

## 'ఓటు' జీవితాలను శాసించే నేటి రాజకీయ పంచతంత్రం!

## ఎన్నికల 'ఫలితాల' ఫలితం! ఓ సామాన్య కుటుంబ తర్పణం!!

### రావినూతల సువర్ణాకన్నన్

ఓ పీడ ఏర్పరచుకున్నారు.

అందుకే ఓబులేసుకి ఎలక్షన్లంటే చచ్చే భయం. అతను భయపడ్డాడని జరిగేవి జరక్క మానవు కదా. ఎలక్షన్లు దగ్గరపడ్డాయి. అతనింటికి పెద్దల రాకపోకలు ఎక్కువయ్యాయి.

మంచంలో ఉన్న అతని తల్లిదండ్రులకి పళ్ళు, హార్లిక్సులు, ఆడపిల్లలకి గాజులు, రిబ్బన్లు, మగపిల్లలకి పెన్నులు, పుస్తకాలు అందాయి. ఎవరికి వారే "మీ ఓట్లు మాకే వెయ్యండి" అని చెప్పి, వేస్తామని అతనిచేత ప్రామిస్ చేయించుకుని మరీ వెళ్ళారు.

ఓబులేసు ఆలోచించి ఆలోచించి ఈసారి చక్రవర్తికే వెయ్యాలని నిర్ణయించుకున్నాడు. కారణం నేలమట్టమైన అతని ఇల్లే.

ఎలక్షన్లయ్యాయి.

ఓట్ల లెక్కింపు అయి ఫలితాలు ప్రకటించారు.

ఈసారి చక్రవర్తి గెలిచాడు.

తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు ఓబులేసు. చక్రవర్తి ఉత్సాహంగా ఊరేగాడు. తనకి ఓట్లేసినవాళ్ళందరికీ స్వయంగా కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

చక్రవర్తి జయజయ ధ్వానాలతో ఊరేగుతుంటే నిప్పుల్లో పెట్రోల్ కుమ్మరించినంతగా మండిపడ్డాడు భూషణం. ఆ కోపంలో తనకి ఓటు వెయ్యలేదని అనుమానం వచ్చిన వాళ్ళందరి మీదా దాడి చేశాడు. బందిపోట్లకన్నా అధ్వాన్నం అనిపించే తన మూకని ఆ ఇళ్ళ మీదికి పంపి ఆ ఇళ్ళన్నీ ధ్వంసం చేయించాడు.

గూడెంలోని వాళ్ళంతా నడుం విరిగిన గొడ్లలా అయిపోయారు. నిలవ నీడ లేకుండా రోడ్డుమీద కూలబడిపోయారు.

వారిలో ముఖ్యుడు ఓబులేసు.

** ** **

కాలగర్భంలో మరో అయిదు సంవత్సరాలు దొర్లిపోయాయి. మళ్ళీ ఎలక్షన్ల రాక్షసి వికటాట్టహాసం చేస్తూ వచ్చింది. ఎలక్షన్ల రక్కసి కొట్టిన దెబ్బ నుంచి ఓబులేసు ఇంకా కోలుకోనేలేదు.

అతని తల్లిదండ్రులు మరింత వృద్ధులయ్యారు. అన్నదమ్ములు కూడా కూలినాలి చేసుకుంటూ బతుకులీడుస్తున్నారు. అతని పిల్లలు మాత్రం హైస్కూల్ చదువులకొచ్చారు. తనలా తన బిడ్డలు అర్థాకలితో బతక్కూడదని, విశ్రాంతి ఎరక్కుండా చాకిరీ చేస్తూ పిల్లల్ని చదివించుకుంటున్నాడు ఓబులేసు.

ఎలక్షన్లు కొద్ది రోజులున్నాయనగా భూషణం వచ్చాడతని దగ్గిరికి.

ఓబులేసు వినయంగా నమస్కరించి ఓ పక్కగా, ఒదిగి నిల్చున్నాడు.

"ఏరా ఓబులూ! ఈసారి మీ ఓట్లు ఎవరికేయిస్తావ్! నాకేనా?" అన్నాడు భూషణం సూటిగా.

"తమకేనండి?" అన్నాడు వినయంగా ఓబులేసు.

"వెయ్యకపోతే ఏమవుతుందో తెలుసుగా!" మీసం మెలేస్తూ దర్పంగా అన్నాడు భూషణం.

"చిత్తం"

"సరే... ఈ వందా వుంచు" విలాసంగా ఓ వంద నోటు అతని మీదికి విసిరాడు భూషణం.

"ఒద్దు బాబూ మా ఓట్లన్నీ తమరికే ఏస్తాంగానీ ఆ డబ్బు మాత్రం మాకొద్దండి" కిందపడ్డ నోటుని తీసి కళ్ళకద్దుకుంటూ ఇవ్వబోయాడు ఓబులేసు.

భూషణం కళ్ళు అనుమానంగా చూశాయి.

"ఏరా ఆ చక్రవర్తిగాడికేస్తావా ఓట్లు!" అన్నాడు తీక్షణంగా.

"సత్యప్రమాణికంగా మా ఓట్లన్నీ తమకేనండీ" నమ్మకంగా అన్నాడు ఓబులేసు.

"ఒకవేళ ఆ చక్రవర్తిగాడొచ్చి అడిగితే?"

"ఎవురడిగినా మా ఓట్లన్నీ తమకేనండి?"

భూషణం మొహం వికసించింది.

"అది అలా వుండాలి. ఆ మాత్రం భయభక్తులుంటే నేనెందుకొస్తాన్రా మీ జోలికి. చూడు నేను గెలవగానే నాలుగొందలు తాటాకొట్టించుకెళ్ళు మన చేనిగట్టు కాణ్ణించి" అన్నాడు ఉదారంగా.

ఓబులేసు వందనోటు మళ్ళీ తిరిగి ఇవ్వబోయాడు.

"ఏరా దబ్బంతెక్కువగా ఉందేంటి! పిచ్చెదవా ఉండనీరా. అన్నట్టొరేయ్ చెప్పడం మరిచాను. మనూరికి కొత్తగా వచ్చిన పంతులుగాడు కూడా ఇండిపెండెంటుగా నిలుస్తున్నాడు. ఒకేళ నీ దగ్గిరికొచ్చి మాయమాటలు చెప్పి లోబరుచుకుంటాడేమో జాగ్రత్త" అన్నాడు భూషణం.

ఓబులేసు మరి మాట్లాళ్ళేదు.

భూషణం వెళ్ళబోయిన వాడల్లా ఆగి "ఇదిగో ఓబులూ! ఆ చక్రవర్తిగాడు డబ్బు ఇస్తానంటే ఒద్దనకు. పేద ముండాకొడుకుని. ఎందుకైనా పనికొస్తాయి. కానీ ఓటుమాత్రం నాకు వెయ్యి.సరేనా?" రహస్యంగా అన్నట్టు అన్నాడు.

"అలాగే బాబూ" అన్నాడు ఓబులేసు.

భూషణం తృప్తిగా వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన అరగంటకి చక్రవర్తి వచ్చాడు మీసం తిప్పుకుంటూ. అతనూ ఇంచుమించు భూషణం చెప్పినట్టే చెప్పి రెండొందలు ఓబులేసు ముందు పడేశాడు.


భూషణానికి చెప్పినట్టే చెప్పి పంపేశాడు ఓబులేసు.

అతనికి తెలుసు. ఎవరికి ఓటు వెయ్యకపోతే రెండోవాళ్ళేం చేస్తారో. అందుకే అతనో నిర్ణయానికొచ్చాడు.

తమ ఇంటివారుఓట్లు ఎవరికీ వెయ్యకూడదు. జరిగిన రెండు ఎలక్షన్లూ అతని కుటుంబం మీద గొడ్డలి పెట్టయ్యాయి. ఈసారి దెబ్బపడితే తనింక లేవలేనని ఈ నిర్ణయానికొచ్చాడు.

అతనాలోచిస్తుండగా ఇండిపెండెంటుగా నిలవబోయే పంతులు వచ్చాడు. అతనెందుకొచ్చాడో గ్రహించిన ఓబులేసు—

"పంతులుగారూ! మీకు దణ్ణపెడతాను నన్ను




మాత్రం ఓటెయ్యమనమాకండి'' అన్నాడు రెండు చేతులూ జోడించి.

''అదేమిటి ఓబులూ! మీ ఇంట్లోని ఓట్లు...''

''బాబూ! మా ఇంట్లో ఓట్లు నేవు. మేమంతా కూటికిలేనోళ్ళం. మమ్మల్నిలా బతకనీయండి'' పంతులు మాట పూర్తికాకుండానే గద్గద స్వరంతో అన్నాడు ఓబులేసు.

''అదేమిటి ఓబులూ! మనది స్వతంత్ర భారతదేశం ఈ దేశం ప్రగతి సాధించాలంటే మీరంతా కలిసి మంచి నాయకుణ్ణి ఎన్నుకోవాలి. అందుకే మీరంతా ఓట్లు తప్పనిసరిగా వెయ్యాలి. మీ ఓటు హక్కుని వినియోగించుకోవాలి'' అంటూ పాఠం మొదలుపెట్టాడు పంతులు.

ఓబులేసులోని ఆవేదన ఇంతెత్తున లేచింది.

''ఎందుకొచ్చిన ఓట్లు బాబూ! ఈ ఓట్ల వల్ల మా కొరిగిందేమిటి? తనకి ఓటెయ్యలేదని ఒకడు నా కొంప తగలెడితే, మరోడు నా కొంప కూల్చేశాడు. ఎవురికెయ్యమంటారు బాబూ!''

''అసలు మాలాటాళ్ళకి ఓటక్కు నేకపోతేనే ఆయిగా బతికేటోళ్ళం. ఎందుకు బాబూ ఈ ఓటు అక్కులు! ఏ పాట్టీకెయ్యోతే ఆ పాట్టీ ఓడే మామీద జులుం శలాయిత్తంటే ఇక మమ్మల్ని రచ్చించే ఓల్లెవరు బాబూ!''

''ఇదుగో బాబూ! మీకేకాదు నానెవ్వరికీ ఓటెయ్యను. నన్నొదిలెయ్యండి'' దుఃఖం నిండిన స్వరంతో అన్నాడు ఓబులేసు.

పంతులు ఏదో చెప్పబోయాడు. ఓటు హక్కుని గురించి క్లాసు తీసుకోవాలని ప్రయత్నించాడు. కానీ ఓబులేసు వినిపించుకోలేదు. తను చచ్చినా ఓటెయ్యనన్నాడు.

పంతులు నిరాశగా వెళ్ళిపోయాడు. నిజానికి పంతులు భూషణం వాళ్ళంత చెడ్డవాడు కాదు. ఆ ఊరి యువకులు, కొందరు పెద్దలూ కలిసి అతన్ని నిలబెట్టారు.

జీవితంలో ఓటు వెయ్యకూడదని నిర్ణయించుకున్న తర్వాత హాయిగా అనిపించింది ఓబులేసుకి.

హడావిడిగా ఎలక్షన్లు ముగిశాయి.

ఫలితాలు తెలిశాయి.

అయితే ఎవరూ ఊహించని రీతిగా నాలుగు ఓట్ల మెజారిటీతో పంతులు నెగ్గాడు.

యువకులంతా హర్షధ్వానాలు చేశారు. భూషణం, చక్రవర్తి ప్రతిమల్లా అయిపోయారు. తేరుకున్నాక ఇద్దరూ ఒకటయ్యారు.

''మనిద్దరం ఇక్కడుండగా ఎక్కణ్ణించో వచ్చిన ఆ బడి పంతులు నెగ్గడమా! అవమానం'' అంటూ చిందులు వేశారు.

''వాణ్ణి బతకనివ్వకూడదు అని పళ్ళు నూరుకున్నారు. కానీ గెల్చిన వాడి వెనక జనం ఉన్నారు. అతన్నేం చెయ్యలేం'' అని దిగులుగా కూలబడ్డారు.

''మార్జిన్‌లో పోయారు. ఆ ఓబులేసుగాడు కనక మీకు ఓట్లు వేసుంటే కచ్చితంగా మీరిద్దరిలో ఎవరో ఒకరు గెల్చేవారు'' అంటూ మెల్లగా నిప్పంటించారెవరో.

''ఏమిటి?'' తృళ్ళిపడ్డారిద్దరూ.

''ఓబులుగాడు ఆ పంతులుకేశాడా ఓట్లు?'' అన్నారు ఏక కంఠంతో.

''కాదు అసలు వాళ్ళు ఓట్లే వెయ్యలేదు'' అన్నారు నిప్పంటించినవారు.

అంతే! భగ్గున మండిపడ్డారు పెద్దలిద్దరూ. తర్వాత పదిమంది గూండాలని వెంట బెట్టుకుని ఓబులేసు ఇంటిమీద పడ్డారు.

అప్పుడు ఓబులేసు గుమ్మంలో కూర్చుని అన్నం తింటున్నాడు. అతని తల్లిదండ్రులు ఆరుబైట ఈతాకు చాపలమీద పడుకుని మూలుగుతున్నారు. అతని తమ్ముళ్ళిద్దరూ పుట్టెడు జ్వరంతో లోపల పడున్నారు. అతని భార్య నీళ్ళకెళ్ళింది.

అలాంటి సమయంలో తుఫానులా వచ్చిపడ్డారు. ఎదురుచూడని ఈ దాడికి కొయ్యబారిపోయాడు ఓబులేసు.

''ఏరా దొంగ నాయాలా! మా దగ్గర డబ్బు తీసుకుని ఓటెయ్యకుండా ఎగ్గొడతావ్‌రా'' అంటూ ఓబులేసు జుట్టుపట్టుకుని లేవదీసి ఎడాపెడా బాదేశాడు భూషణం.

ఒణికిపోయారు పరిసరాల వాళ్ళు. చక్రవర్తి ఓబులేసు తినే అన్నం గిన్నెని కాలితో తన్ని అతన్ని పక్కనున్న రాతి స్తంభానికేసి కొట్టాడు. ఫలితంగా అతని తల చిట్లింది.

లేవలేని వృద్ధులు ఆర్తనాదాలు చేశారు. అంతటితో పరాజితులు ఆగలేదు. ఓబులేసుని కిందపడేసి కాళ్ళతో మట్టగించేశారు.

నీళ్ళకెళ్ళొచ్చిన ఓబులేసు భార్య జరిగేది చూసి ఒణికిపోయింది. చేతిలోని కుండ కిందపడేసి వాళ్ళ కాళ్ళ కడ్డం పడి—


''ఏటయ్యా ఈ అన్యాయం! ఎవురికేస్తే ఎవురికోపం వస్తాదో అని అసలు ఓటెయ్యడమే మానేత్తే! ఇద్దరూ కలిసి ఆణ్ణి సావగొడతారా? ఇదెక్కడి న్యాయమయ్యా'' అంది ఏడుస్తూ.

''దేశ స్వతంత్రం గురించి, ఓటు విలువ గురించి మీకేం తెలుసే. ఇది పవిత్ర భారతదేశం. అందులో ఓటు మరీ పవిత్రమైంది. అలాంటి ఓటుని దుర్వినియోగం చేస్తారా!'' అరిచాడు చక్రవర్తి.

''ఎవురికయ్యా సొతంత్రం ఒచ్చింది! ఈ సొతంత్రం మాకేటిచ్చిందయ్యా? దీనివల్ల మీలాటోల్లందరికీ ఒచ్చింది సొతంత్రం! ఈ ఎలచ్చన్ల ఒల్ల మీరంతా బాగడ్డారు. కానీ మేం మీ కాల్లకిందే నలుగుతున్నావయ్యా. ఏ పాట్టీ ఒత్తే మాత్రం మాకేటి సేశారయ్యా వాగ్దానాలు తప్ప!

డ్రైవర్ పోస్టుకి ఇంటర్వ్యూ జరుగుతోంది.
అధికారి: రోడ్డు మీద స్పీడ్ బ్రేకర్లు ఎందుకు వేస్తారు?
అభ్యర్థి: బస్సులో ప్రయాణీకులు నిద్రలేవటానికి సార్!

—బోళ్ళ చైతన్యకిరణ్, శికోదుపాలెం.



ఇదిగో బాబులూ! మాకా ఎలచ్చన్లొద్దు.ఓట్లూ ఒద్దు. మమ్మల్నిలా గెంజి తాగుతా బతక నియ్యండయ్యా. మాకింతకన్నా సొతంత్రం ఒద్దు'' అంటూ వాళ్ళ కాళ్ళు పట్టుకు బతిమాలిందామె ఏడుస్తూనే.

ఆమె మాటలు వాళ్ళని మరింత ఆవేశ పూరితుల్ని చేశాయి.

''ఏమిటే స్వతంత్రం ఒద్దంటావా? ఎంత ధైర్యం. ఎంత దేశద్రోహం'' అంటూ గుండెలు బాదుకున్నారు.

''ఇంకా ఆళ్ళతో మాటలేంటి బాబూ! జరగాల్సింది సూడక'' చక్రవర్తి, భూషణం పెట్టిన తిండితో ఒళ్ళు పెంచిన గూండాలు ఉత్సాహంగా అన్నారు.

''ఊ! కానీండి. మర్యాదగా మీరు మాకు ఓట్లేస్తే ఇవాళ ఈ స్థితి ఒచ్చేదికాదు. చేసిందానికి అనుభవించండి'' అని తన మనుషులకి సైగ చేశాడు భూషణం.

అంతే...

రెండు డబ్బాల పెట్రోల్ ఓబులేసు పాక మీద కుమ్మరించారు గూండాలు.

ఆర్తనాదాలు చేశారు ఆడవాళ్ళు. గూడెమంతా పరిగెత్తుకొచ్చింది.

''మీరంతా అవతలికెళ్ళండి'' అంటూ హుంకరించాడు చక్రవర్తి. అతని సంగతి తెలిసిన వాళ్ళెవరూ ముందుకి రాలేదు.

నిప్పుపుల్ల గీశాడు భూషణం. గొల్లుమన్నారు ఆడవాళ్ళు. ఇరుగుపొరుగులు ప్రతిమల్లా అయిపోయారు. ఓబులేసు రివ్వున ఇంట్లోకెళ్ళబోయాడు. అయితే అతన్ని పట్టి ఆపి—

''ఈణ్ణి లోనికెళ్ళనీకండి. లోపలున్న ఓ గుడ్డ ముక్కయినా బైటికి రాకూడదు. కట్టు గుడ్డ, తిన తిండే లేకుండా వీధులు పట్టి తిరగాలి'' అంటూ గర్జించాడు చక్రవర్తి.

కొంప భగ్గుమంది.

కెవ్వుమన్నాడు ఓబులేసు.

''బాబూ! లోన నా తమ్ముళ్ళిద్దరూ జొరంతో లెగలేని పరిస్థితుల్లో ఉన్నారు. వాళ్ళని రచ్చించండి బాబూ'' అంటూ వాళ్ళ కాళ్ళు పట్టుకున్నాడు. అయితే ఎవరూ అతని మాటలు వినిపించుకోలేదు.

మంటలు నలుమూలలకీ వ్యాపించాయి. లోపలున్నవాళ్ళ అరుపులు, బైటవున్న వాళ్ళ అరుపులతో కలిసిపోయాయి.

ఓబులేసు గుండె క్షణం ఆగి, తిరిగి రెట్టింపు వేగంగా కొట్టుకుంది. అతనికి భవిష్యత్ అంధకారంగా అనిపించింది.

ఇంక లోపలికి ఎవరూ వెళ్ళలేరు అన్న నమ్మకం కలిగాక ఓబులేసు దంపతుల్ని వదిలారు అంత వరకు వాళ్ళని పట్టుకున్న గూండాలు.

అప్పుడే దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు ఓబులేసు.

''నాకీ ఎలచ్చన్లొద్దు. నాకీ ఓట్లొద్దు. అసలు నాకీ లోకమే ఒద్దు'' అంటూ మండుతున్న ఇంట్లోకి పరిగెత్తాడు.

కెవ్వుమంటూ అతని భార్య అతన్ననుసరించింది. జరిగేదంతా నిస్సహాయంగా చూస్తున్న అతని తల్లిదండ్రుల గుండెలు ఠక్కున ఆగిపోయాయి.

అగ్నిగోళంలా మండుతున్న ఓబులేసు పాకని చూశాక చక్రవర్తి, భూషణాల మనసులు చల్లబడ్డాయి.

''నయ్యాల ఇలాంటెదవ్వేషాలేసిన ఎవరికైనా ఇదే శాస్తి'' అంటూ అతి సఖ్యతగా ఒకే కార్లో కూర్చుని వెళ్ళిపోయారు.

పాకనీ, పాకలో వున్న వ్యక్తుల్నీ, సామగ్రినీ తృప్తిగా ఆరగించిన అగ్ని దేవుడు శాంతించాడు.

బతికున్న వ్యక్తులు బూడిదయ్యారు. చచ్చిన ఇద్దరూ మాత్రం—

''మమ్మల్నెవరు బూడిద చేస్తారు?'' అన్నట్టు అక్కడే పడున్నారు శవాలుగా.

మర్నాడు పేపర్లో ఫ్రెంట్ పేజీలో బ్రహ్మాండమైన వార్త వచ్చింది.


ప్రమాదవశాత్తూ గూడెంలోని ఓ గుడిసె అంటుకుని అందులోని నలుగురూ సజీవ సమాధి అయిపోయారు.

తమ ముగ్గురు కొడుకులు, కోడలూ పోవడం కళ్ళారా చూసిన వృద్ధ దంపతుల గుండె ఆగి చనిపోతే, ఆ ఊరి పెద్దలు శ్రీ చక్రవర్తిగారు, శ్రీ భూషణంగారు పెద్ద మనసుతో వారి అంత్యక్రియలని స్వయంగా దగ్గరుండి జరిపించారు. ఇలాంటి పెద్దలు వుండబట్టే ఇంకా న్యాయం, ధర్మం ఈ దేశంలో వుండగలుగుతోంది.

ఇదీ పేపర్లలో వచ్చినవార్త. అందరూ దాన్ని చదివారు. తెలియనివాళ్ళు ఆ పెద్దల్ని మెచ్చుకున్నారు. తెలిసినవాళ్ళు దాన్ని ఖండించకుండా మౌనంగా ఉండిపోయారు.

అలా వుండకపోతే ఓబులేసు కుటుంబానికి పట్టిన గతే తమకీ పడుతుందని వాళ్ళకి బాగా తెలుసు.

** ** **



ఇద్దరు ఖైదీలు ఒకరి కొకరు ఇలా అనుకుంటున్నారు.

పది సూట్‌కేసుల నిండా తయారుచేశావు గదా దొంగనోట్లు...ఎలా పట్టుబడ్డావు?

ఏంలేదు పొరపాట్న గవర్నర్ అన్న చోట నా సంతకం పెట్టాను. అంతే!........

—ఆర్.శుభ, మేడపల్లి.

